TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు   తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

సంపుటి : 01 సంచిక : 225 | సోమవారం 21-04-2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5

# జపాన్ లోని కితాక్యూషూ నగరంలో సీఎం రేవంత్ బృందానికి ఘన స్వాగతం



- సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, మూసీ నది ప్రక్షాళన రాష్ట్ర అభివృద్ధికి కీలకం అని పేర్కొన్నారు.
- గుజరాత్‌లో సబర్మతి, వారణాసిలో గంగా, ఢిల్లీలో యమునా నదీ అభివృద్ధి ప్రాజెక్టుల్ని ఆదర్శంగా తీసుకుంటూ మూసీ నదికి రివర్ ఫ్రంట్ అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

జపాన్‌లోని కితాక్యూషూ నగరంలో సీఎం రేవంత్ బృందానికి ఘన స్వాగతం

కితాక్యూషూ: జపాన్‌లో పర్యటిస్తున్న తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం కితాక్యూషూ మేయర్‌ను కలుసుకున్నారు. నగర మేయర్ కజుహిసా టకేచీ గారు తెలంగాణ బృందాన్ని అక్కడి సాంప్రదాయ రీతిలో ఘనంగా స్వాగతించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు మరియు అధికారులకు మేయర్ స్వాగతం పలికారు. ఒకప్పుడు జపాన్‌లో అత్యంత కాలుష్యంతో ఉన్న నగరం కితక్యూషూ. గాలి, నీరు, నేల విషపూరితంగా ఉండేవి. ఇప్పుడు ఈ నగరం పర్యావరణ పరిరక్షణలో ప్రపంచానికే ఉత్తమ ఉదాహరణగా నిలిచింది.

రాష్ట్ర అభివృద్ధిలో మూసీ నది ప్రక్షాళన కీలకమని సీఎం రేవంత్‌రెడ్డి జపాన్‌లోని టోక్యోలో జరిగిన 'జపాన్ తెలుగు సమాఖ్య' సమావేశంలో చెప్పారు. గుజరాత్‌లో సబర్మతి, వారణాసిలో గంగా, ఢిల్లీలో యమునా రివర్ ఫ్రంట్‌ల స్ఫూర్తితో తెలంగాణలో మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్‌ను చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు.

చెరువు మధ్యలో ఉన్న నిర్మాణాలను చూస్తూ ఊరుకుందామా అని ప్రశ్నించారు. వాటిని కూల్చకపోతే ప్రకృతి క్షమించదన్నారు. యూఎస్‌లో హడ్సన్, లండన్‌లో థేమ్స్, సియోల్‌లోని నదులను స్వయంగా చూసిన అనుభవాన్ని ఆయన పంచుకున్నారు. హైదరాబాద్‌ను పొల్యూషన్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలంటే మూసీ నదిని కాలుష్య రహితంగా మార్చాలని తెలిపారు.

హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరాలైన న్యూయార్క్, టోక్యో, లండన్‌తో పోటీపడే స్థాయికి తీసుకెళ్లాలంటే ప్రవాస తెలుగువాళ్ల సహకారం, ఆలోచనలు కీలకమని, సొంత రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవడంలో ఉన్న ఆనందం అపూర్వమైందని సీఎం రేవంత్ రెడ్డి టోక్యోలో జరిగిన 'జపాన్ తెలుగు సమాఖ్య' కార్యక్రమంలో ప్రసంగించారు.

## డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం చేయిచేయి కలుపుదాం: చిరంజీవి

### టీవర్క్స్ వద్ద నోటి క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.


2లో..

హైదరాబాద్: నగరంలోని టీవర్క్స్ వద్ద నోటి క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ నటుడు చిరంజీవి వర్చువల్ సందేశం పంపారు. డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం చేయిచేయి కలుపుదామన్నారు. వ్యసనాలకు బానిసలై కొందరు తమ కలలను దూరం చేసుకుంటున్నారని చెప్పారు. మాదకద్రవ్యాల కట్టడిపై ప్రభుత్వంతో పాటు అందరం అవగాహన కల్పించాలని కోరారు. డ్రగ్స్‌ను నిర్మూలిద్దామని పిలుపునిచ్చారు.

## గిరిజనులను రెచ్చగొట్టవద్దు: మంత్రి సీతక్క


2 లో

## అనితర సాధ్యుడు చంద్రబాబుకు వజ్రోత్సవ జన్మదిన శుభాకాంక్షలు: పవన్ కల్యాణ్



**ఏపీ సీఎం చంద్రబాబుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 'ఎక్స్' వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.**

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 'ఎక్స్' వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "అనితర సాధ్యుడు చంద్రబాబుకు వజ్రోత్సవ జన్మదిన శుభాకాంక్షలు. రాష్ట్ర ప్రగతిని పునరుజ్జీవింపచేయడం ఆయన వంటి దార్శనికుడికే సాధ్యం. చంద్రబాబు విజన్, నిరంతరం పనిలో చూపే ఉత్సాహం అద్భుతం. భవిష్యత్తు అంచనా వేసి వ్యవస్థలను నడిపించే విధానం స్ఫూర్తిదాయకం.

2 లో

## త్వరలోనే ఆర్టీసీలో 3,038 ఉద్యోగాలకు నోటిఫికేషన్: మంత్రి పొన్నం





తెలంగాణ ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. త్వరలోనే 3,038 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు.

2 లో

# ఉప ఎన్నికలు ఈ ఏడాదిలోనే వస్తాయి: కేటీఆర్

**అత్తాపూర్ డివిజన్ కాంగ్రెస్ నేత వనం శ్రీరామ్‌రెడ్డి భారాసలో చేరారు.**


2 లో

## బీజేపీ.. బీఆర్ఎస్ లను ఎవరూ నమ్మరు


2 లో

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కరీంనగర్ లో పర్యటించారు. ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీలను ఎవరు నమ్మరని స్పష్టం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దుర్మార్గమైన పాలన కొనసాగిస్తోందన్నారు. కేంద్రం తాత్కాలిక ఉపయోగాల కోసమే చేస్తుందని దీర్ఘకాలిక ప్రయోజనాల కోసమం ఎలాంటి పనులు చేపట్టలేదన్నారు. తెలంగాణలో బీజేనీ ఆటలు సాగవన్న కూనం నేని సీపీఐ ప్రజా సమస్యలపై పోరాడుతోందన్నారు.

## దంచి కొట్టిన సూర్య, రోహిత్.. చెన్నైను చిత్తుగా ఓడించిన ముంబై

ఐపీఎల్ 2025 లో వరుస విజయాలతో ఢీలా పడిన ముంబై ఇండియన్స్ విజయాల బాట పట్టింది. మొదట ఆడిన 5 మ్యాచ్ ల్లో ఒకటే గెలిచిన ముంబై.. ఢిల్లీ, సన్ రైజర్స్ పై వరుస విజయాలను సాధించింది. వాంఖడే వేదికగా ఆదివారం (ఏప్రిల్ 20) చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టింది.



మిగతాది 2లో

# సంపాదకీయం

## పొంగిపోకుండా, కుంగిపోకుండా...

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు 75వ పుట్టినరోజు జరుపుకొంటున్నారు. 1978లో తొలిసారిగా ఆయన ఇందిరా కాంగ్రెస్ (ప్రస్తుత కాంగ్రెస్) తరఫున శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. నాటి నుంచి నేటి వరకు తెలుగునాట రాజకీయాలలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. తెలుగునాట ఇంత సుదీర్ఘ కాలం రాజకీయాలలో కీలక పాత్ర పోషిస్తూ వచ్చిన నాయకుడు మరొకరు లేరు అంటే అతిశయోక్తి కాదు. ఈ 47 ఏళ్లలో ఆయన ఎన్నో ఉత్థానపతనాలు చూశారు. అపజయాలు, అవమానాలకు కుంగిపోకుండా రాజకీయాలలో ఆయన తన స్థానాన్ని పదిలం చేసుకుంటూ వస్తున్నారు. 1978లో ఎమ్మెల్యేగా తొలిసారి ఎన్నికైన ఆయన అదే టర్మ్‌లో మంత్రి కూడా అయ్యారు. మంత్రి పదవితో పాటు ఆయనను మరో అదృష్టం కూడా వరించింది. పిన్న వయసులోనే మంత్రిగా నియమితులైన చంద్రబాబును చూసి ముచ్చటపడిన ఎన్టీ రామారావు తన కుమార్తె భువనేశ్వరిని ఆయనకు ఇచ్చి పెళ్లి చేశారు. అప్పటి నుంచి ఆయన జాతకం మారింది. మంత్రిగా ఉండగానే ఆయన పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించి సస్పెండ్ అవడం, సాయంత్రానికల్లా తనపై విధించిన సస్పెన్షన్‌ను తొలగింపజేసుకొని రాజకీయాల్లో సంచలనం సృష్టించారు. అప్పుడు చిత్తూరు జిల్లా జెడ్పీ చైర్మన్ పదవికి మరో మంత్రి నల్లారి అమర్నాథ్‌రెడ్డి ప్రతిపాదించిన అభ్యర్థిని పార్టీ ఖరారు చేయగా, అధికార అభ్యర్థిని కాదని మరో మంత్రి సి.దాస్‌తో కలసి డాక్టర్ కుతూహలమ్మను పోటీ పెట్టి గెలిపించుకున్నారు. దీంతో పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించినందుకు నాటి పీసీసీ అధ్యక్షుడు కోన ప్రభాకరరావు ఆగ్రహించి మంత్రులుగా ఉన్న చంద్రబాబు నాయుడు, దాస్‌లను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. దీంతో ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ అధినాయకత్వాన్ని కలసి, వారికి వాస్తవ పరిస్థితిని వివరించి తమపై విధించిన సస్పెన్షన్‌ను చంద్రబాబు రద్దు చేయించుకున్నారు. అప్పట్లో ఇదొక సంచలనం. ఆ తర్వాత 1982లో ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించడం, 1983 ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన చంద్రబాబు తెలుగుదేశం అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత తెలుగుదేశంలో చేరి, 1984 ఆగస్టు సంక్షోభంలో పదవీచ్యుతుడైన ఎన్టీరామారావుకు అండగా నిలబడి పార్టీలో తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. సంక్షోభ సమయంలో చంద్రబాబు రాజకీయ చాతుర్యాన్ని గమనించిన ఎన్టీ రామారావు.. తెలుగుదేశం పార్టీ రాజకీయాలలో చంద్రబాబును ప్రోత్సహించారు. 1989 ఎన్నికల్లో ఎన్టీఆర్ అధికారం కోల్పోయిన తర్వాత తెలుగుదేశం పార్టీలో చంద్రబాబు పాత్ర మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. సభలో తనను అవమానించిన కారణంగా శాసనసభను ఎన్టీఆర్ బహిష్కరించగా, చంద్రబాబు అన్నీ తానై నడిపించారు. అధికారంలో ఉన్నప్పుడు ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలను కూడగట్టడంలో ఎన్టీఆర్‌ది కీలక పాత్ర కాగా, ఆ అవకాశాన్ని ఉపయోగించుకున్న చంద్రబాబు జాతీయ స్థాయి నాయకులతో పరిచయాలు పెంచుకున్నారు. 1989 తర్వాత ఎన్టీఆర్ మార్గదర్శకత్వంలో తెలుగుదేశం పార్టీ కార్యకలాపాలను మొత్తం ఆయన పర్యవేక్షించినప్పటికీ ఎన్టీఆర్ జీవితంలోకి లక్ష్మీపార్వతి ప్రవేశించడంతో చంద్రబాబు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్టీఆర్‌పై లక్ష్మీపార్వతి ప్రభావం అధికంగా ఉండటంతో అనేక సందర్భాలలో పార్టీ వ్యవహారాల్లో చంద్రబాబు మాట చెల్లుబాటు అయ్యేది కాదు. ఈ నేపథ్యంలో 1994లో ఎన్టీఆర్ మళ్లీ అధికారంలోకి రావడం, పార్టీలోనే కాకుండా ప్రభుత్వంలోనూ లక్ష్మీపార్వతిదే పైచేయి కావడంతో చంద్రబాబు ఉక్కపోతకు గురయ్యారు. పరిస్థితి చేయి దాటిపోతోందని భావించిన చంద్రబాబు నాయుడు పార్టీలో మరో ముఖ్యుడిగా ఉన్న తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావును కలుపుకొని ఎన్టీఆర్ కుటుంబాన్ని తనవైపు తిప్పుకొన్నారు. లక్ష్మీపార్వతికి వ్యతిరేకంగా ఎన్టీఆర్‌పై తిరుగుబాటు చేయడం, ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టడం, తెలుగుదేశం పార్టీని కూడా సొంతం చేసుకోవడం 1995లో జరిగింది. 1984లో అధికారం కోల్పోయినప్పుడు ఎన్టీఆర్‌కు అండగా నిలబడి ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం పోరాడిన ప్రజలు.. 1995లో మాత్రం లక్ష్మీపార్వతి పాత్ర కారణంగా ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుడ్ని చేసినా పట్టించుకోలేదు.

అధికారాన్ని కోల్పోయిన కొంత కాలానికే ఎన్టీఆర్ కన్ను మూయడం, 1996లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి గౌరవప్రదమైన సంఖ్యలో సీట్లు గెలిపించుకోగలగడంతో తెలుగు రాజకీయాల్లో చంద్రబాబు స్థానం సుస్థిరమైంది. 1978లోనే చంద్రబాబుతో పాటు ఇందిరా కాంగ్రెస్ తరఫున కాకుండా రెడ్డి కాంగ్రెస్ తరఫున తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన రాజశేఖరరెడ్డి సమ ఉజ్జీగా తెలుగునాట రాజకీయాలలో కీలక పాత్ర పోషించారు. కేంద్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నా యంగా యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పాటు కావడంలో చంద్రబాబు పాత్ర కీలకం. ఆ తర్వాత వాజపేయి నేతృత్వంలో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటులో కూడా చంద్రబాబు కీలక పాత్ర పోషించారు. ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాకుండా జాతీయ స్థాయిలో కూడా చంద్రబాబు తనదైన ముద్ర వేసుకున్నారు. జాతీయ రాజకీయాలతో పాటు రాష్ట్రంలో కూడా ఆయన కొంతకాలం కమ్యూనిస్టులతో, మరికొంత కాలం భారతీయ జనతా పార్టీతో జట్టు కట్టారు. రాజకీయాలలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికి ఆయన తన వైఖరిని ఎప్పటికప్పుడు మార్చుకున్నారు. ఈ కారణంగానే రాజకీయ అవకాశవాది అన్న విమర్శను చంద్రబాబు ఎదుర్కోవలసి వచ్చింది. భారతీయ జనతా పార్టీకి కొంత కాలం దగ్గరగా ఉండటం, మరికొంత కాలం దూరంగా జరగడంతో జాతీయ రాజకీయాల్లో ఆయన ప్రతిష్ఠకు మచ్చ ఏర్పడింది. తన రాజకీయ పోకడలు, నిర్ణయాలపై చంద్రబాబు ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నారు. సందర్భాన్ని, పరిస్థితిని బట్టి నిర్ణయాలు తీసుకొని ఉండకపోతే ఇతరుల వలె తాను కూడా రాజకీయాల నుంచి ఎప్పుడో కనుమరుగయ్యే వాడినని విమర్శకులకు సమాధానంగా ఆయన చెబుతుంటారు. ఒక దశలో ప్రధానమంత్రి పదవి చేపట్టే అవకాశం వచ్చినా చంద్రబాబు కాదనుకున్నారు. జాతీయ స్థాయిలో కూడా ఉద్ధండ రాజకీయ నాయకులతో కలిసి పనిచేసిన అనుభవం ఆయన సొంతం. కమ్యూనిస్టు ఉద్ధండులు జ్యోతి బసు, హరికిషన్ సింగ్ సుర్జీత్‌లతో పాటు భారతీయ జనతా పార్టీ అగ్రనాయకులు అటల్ బిహారీ వాజపేయి, లాల్‌కృష్ణ ఆడ్వానీ వంటి వారు చంద్రబాబు మాటకు, నిర్ణయాలకు విలువ ఇచ్చేవారు. దేవెగౌడ, ఐకే గుజ్రాల్‌లను ప్రధానమంత్రులుగా చేయడంలోనూ, డాక్టర్ అబ్దుల్ కలాంను రాష్ట్రపతిగా నియమించడంలోనూ చంద్రబాబుది కీలక పాత్ర. 2019 ఎన్నికలకు ముందు ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో తీవ్రంగా విభేదించిన చంద్రబాబు.. 2024 ఎన్నికల్లో తిరిగి ఆయనతోనే జత కట్టారు. నిజానికి 2024కు ముందు చంద్రబాబుతో చేతులు కలపడానికి ప్రధాని మోదీ అంతగా ఇష్టపడలేదు. అయితే ఆంధ్రప్రదేశ్ రాజకీయాల గురించి తెలంగాణకు చెందిన ఒక కీలక నాయకుడితో జరిపిన చర్చలు ప్రధాని మోదీపై ప్రభావం చూపాయి. 'ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు చంద్రబాబు జీరోగా కనిపించవచ్చు. ఈ ఎన్నికల్లో ఆయనకు 20 వరకు ఎంపీ స్థానాలు వస్తాయి. చంద్రబాబును రాష్ట్రంలో 40 శాతం మంది ప్రజలు వ్యతిరేకించవచ్చు కానీ జాతీయ స్థాయిలో ఆయన ఎటు నిలబడితే అటు బలం చేకూరుతుంది. ఈ ఎన్నికల్లో బీజేపీకి మెజారిటీ లభించదు. చంద్రబాబు గణనీయమైన సంఖ్యలో సీట్లు గెలుచుకుంటారు. ఆయన ఇండియా కూటమి వైపు మళ్లితే పరిస్థితిని ఊహించుకోండి' అని సదరు కీలక నేత ప్రధాని మోదీకి వివరించారు. ఈ కారణంగానే అని చెప్పలేం గానీ చంద్రబాబుతో స్నేహం విషయంలో ప్రధాని మోదీ తన మనసు మార్చుకోవడానికి ఇది కూడా ఒక కారణమని చెప్పవచ్చు.

### విజన్.. ఓర్పు.. సహనం!

చంద్రబాబు రాజకీయాలను, నిర్ణయాలను వ్యతిరేకించేవారు రాష్ట్రంలోనే కాదు.. జాతీయ స్థాయిలోనూ ఉన్నారు. అయితే ఆయన పట్టుదలను, కృషిని ప్రశంసించనివారు అరుదుగా ఉంటారు. చంద్రబాబుకు తెలుగు, ఇంగ్లిషులో వాగ్ధాటి లేదు. అయినా అంతర్జాతీయ ప్రముఖుల మన్ననలను ఆయన చూరగొనగలిగారు. అభివృద్ధి విషయంలో ఆయనకు ఉన్న అంకితభావమే ఇందుకు కారణం. విజనరీగా పేరొందిన చంద్రబాబు.. అప్పుడు ప్రజలకు అందనంత దూరంలో పరుగెట్టేవారు. ఫలితంగా ఓటమిపాలవుతూ వచ్చారు. ఆయన విజన్‌ను అందుకోలేని ప్రజలు ఆయనను ఓడించారు. చంద్రబాబు రాజకీయాలను విమర్శించేవారు కూడా రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అది చంద్రబాబుతోనే సాధ్యం అని అంగీకరించక తప్పని పరిస్థితి. తక్షణ ప్రయోజనాలు, స్వల్పకాలిక ప్రయోజనాలు ఆశించే ప్రజలతో పాటు పార్టీ శ్రేణులు కూడా చంద్రబాబుతో మరీ అంత దూరదృష్టి ఎందుకు అని విభేదిస్తూ ఉంటారు. అయితే తెలుగుదేశం పార్టీని ఎన్టీఆర్ స్థాపించినప్పటికీ ఆ పార్టీని కాపాడి నిలబెట్టింది మాత్రం చంద్రబాబే. 1995లో

## దంచి కొట్టిన సూర్య, రోహిత్..
## చెన్నైను చిత్తుగా ఓడించిన ముంబై


మొదటి పేజీ తరువాయి
భారీ ఛేజింగ్ లో స్టార్ బ్యాటర్లు సూర్య కుమార్ యాదవ్(30 బంతుల్లో 68: 6 ఫోర్లు, 5 సిక్సర్లు), రోహిత్ శర్మ(45 బంతుల్లో 76: 6 సిక్సర్లు, 4 ఫోర్లు) చెలరేగడంతో ముంబై సునాయాస విజయాన్ని అందుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ కు దిగిన చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. ఛేజింగ్ లో ముంబై 15.4 ఓవర్లలో వికెట్ కోల్పోయి 177 పరుగులు చేసి గెలిచింది.

177 పరుగుల లక్ష్య ఛేదనలో ముంబైకి సూపర్ స్టార్ట్ లభించింది. ఓపెనర్లు రోహిత్ శర్మ, రికెల్ టన్ మెరుపులు మెరిపించడంతో పవర్ ప్లే లో వికెట్ నష్టపోకుండా 62 పరుగులు చేసింది. ఏడో ఓవర్లో 24 పరుగులు చేసిన రికెల్ టన్ ఔట్ కావడంతో ముంబై తొలి వికెట్ కోల్పోయింది. ఈ దశలో రోహిత్ కు జత కలిసిన సూర్య అదే పనిగా రెచ్చిపోయాడు. మరో ఎండ్ లో హిట్ మ్యాన్ హిట్టింగ్ చేయడంతో మ్యాచ్ పూర్తిగా ముంబై చేతుల్లోని వచ్చింది. చెన్నై బౌలర్లకు ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా బౌండరీల వరద పారించారు.

ఈ క్రమంలో రోహిత్ శర్మ 12 ఓవర్లో 30 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్ లో సూర్య 26 బంతుల్లోనే ఫిఫ్టీ మార్క్ చేరుకున్నాడు. చివర్లో వీరు మరింతగా చెలరేగడంతో మ్యాచ్ 16 ఓవర్లు ముందుగానే ముగిసింది. పతిరానా వేసిన 16 ఓవర్ మూడు, నాలుగు బంతులకు వరుస సిక్సర్లు కొట్టి సూర్య మ్యాచ్ ను ఫినిష్ చేశాడు. సూర్య, రోహిత్ రెండో వికెట్ కు అజేయంగా 54 బంతుల్లోనే 114 పరుగులు జోడించడం విశేషం. చెన్నై బౌలర్లలో జడేజాకు ఏకైక వికెట్ దక్కింది.

మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటింగ్ లో రాణించింది. స్టార్ ప్లేయర్లు జడేజా(35 బంతుల్లో 53:4 ఫోర్లు, 2 సిక్సర్లు), దూబే(32 బంతుల్లో 50:2 ఫోర్లు, 4 సిక్సర్లు) బాధ్యతగా ఆడి హాఫ్ సెంచరీ చేయడంతో ముంబై ముందు భారీ టార్గెట్ సెట్ చేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ కు దిగిన చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. 53 పరుగులు చేసిన జడేజా టాప్ స్కోరర్ గా నిలిచాడు. ముంబై బౌలర్లలో బుమ్రా రెండు.. సాంట్నర్, అశ్వని కుమార్, దీపక్ చాహర్ తలో వికెట్ పడగొట్టారు.

## ఒకే గుడి, ఒకే బావి.. మోహన్ భగవత్ పిలుపు



దిల్లీ: కుల భేదాలకు స్వస్తి పలకాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ హిందూ కమ్యూనిటీ ప్రజలకు పిలుపునిచ్చారు. "ఒకే గుడి, ఒకే బావి, ఒకే శ్మశాన వాటిక" అనే సూత్రానికి మనమంతా కట్టుబడి ఉండాలని సూచించారు. దీన్ని పాటిస్తూ సామాజిక సామరస్యానికి కృషి చేయాలని కోరారు.

అలీగఢ్‌లో ఐదు రోజుల పర్యటనలో ఉన్న మోహన్ భగవత్ అక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హిందూ విలువల ప్రాముఖ్యతను చెప్పారు. "ప్రపంచవ్యాప్తంగా శాంతి సాధించడానికి ముందుగా.. భారత్ సామాజిక ఐక్యత సాధించడం కీలకం. హిందూ సమాజానికి పునాదిగా భావించే సంస్కారం (విలువలు), సంప్రదాయం, సాంస్కృతిక విలువలు, నైతిక సూత్రాల పేరుతో ఆ చీకటి లోయల లోతుల్లో పాతుకుపోయిన ఈ సమాజ ఆలోచన తీరును నిర్మూలించాలి. కుల భేదాలకు స్వస్తి పలకాలి" అని పిలుపునిచ్చారు.

మర్యాదగా మాట్లాడే పరిస్థితుల్లో లేను: దిల్లీ ఎయిర్‌పోర్ట్‌పై ఒమర్ అబ్దుల్లా ఆగ్రహం

"నైతిక విలువలను పాటిస్తూ సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని పోవాలి. ఎలాంటి భేదాలు చూపకుండా అన్ని వర్గాల వారిని ఇళ్లలోకి ఆహ్వానించాలి. అట్టడుగు స్థాయిలో సామరస్యం, ఐక్యతను వ్యాప్తి చేయాలి. సంస్కారం అనే పునాదిపై నుంచి కుటుంబం, దాని విలువలు రూపుదిద్దుకున్నాయి. ఇది సమాజంలో ప్రాథమిక యూనిట్‌గా ఉంటోంది. జాతీయవాదం, సామాజిక ఐక్యత పునాదులను మరింత బలోపేతం చేసేందుకు అన్ని పండుగలను సామూహికంగా నిర్వహించడం ఎంతో ముఖ్యం" అని పేర్కొన్నారు.

## నా కలను సాకారం చేసింది ఆయనే - లలిత్ మోదీ



ఐపీఎల్ కార్యరూపం దాల్చడంలో శరద్ పవార్ పాత్ర ఎంతో ఉందని లలిత్ మోదీ పేర్కొన్నాడు. ఈ ఆటను గ్లోబల్ ఐకాన్‌గా నిలిపిన ఆ సీనియర్ నేతను మరచిపోవద్దన్నారు. ఐపీఎల్ రూపకల్పనలో పవార్ కీలకంగా వ్యవహరించారని పేర్కొంటూ ఆంగ్ల పత్రికలో వచ్చిన ఓ వార్తా కథనాన్ని ప్రస్తావిస్తూ లలిత్ ఈ విధంగా స్పందించారు.

"ఇది అక్షరాల నిజం. శరద్ పవార్ వల్లే అది సాధ్యమైంది. ఆయన నాపై ఉంచిన విశ్వాసం, 100శాతం ప్రోత్సహించడం వల్లే ఐపీఎల్ కార్యరూపం దాల్చింది. ఈ విషయంలో మనందరం ఆయనకు ధన్యవాదాలు చెప్పాలి. నా కలను ఆయన సాకారం చేశారు. పవార్ దార్శనికతను ఎన్నడూ మరచిపోవద్దు. ఈ విషయంలో ఆయనకు సెల్యూట్" అని లలిత్ మోదీ తన సామాజిక మాధ్య ఖాతాల్లో పోస్టు చేశాడు.

ఠాక్రేల మధ్య చర్చలు! – సంజయ్ రౌత్

ముంబయిలోని వాంఖడే స్టేడియంలోని ఓ విభాగానికి శరద్ పవార్ పేరు పెట్టాలని ముంబయి క్రికెట్ అసోసియేషన్ ఇటీవల తీసుకున్న నిర్ణయంపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఐపీఎల్‌లో శరద్ పవార్ పాత్రకు సంబంధించి మీడియాలో కథనాలు వచ్చాయి. ఇదిలాఉంటే, శరద్ పవార్ ముంబయి క్రికెట్ అసోసియేషన్‌కు అనేక పర్యాయాలు అధ్యక్షుడిగా పనిచేశారు. 2005 నుంచి 2008 వరకు బీసీసీఐ అధ్యక్షుడిగా, 2010 నుంచి 2012 వరకు ఐసీసీ అధినేతగానూ సేవలందించారు.

# ఉప ఎన్నికలు
## ఈ ఏడాదిలోనే వస్తాయి: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి
హైదరాబాద్: ఉప ఎన్నికలు ఈ ఏడాదిలోనే వస్తాయని.. అందరూ సిద్ధంగా ఉండాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అత్తాపూర్ డివిజన్ కాంగ్రెస్ నేత వనం శ్రీరామ్‌రెడ్డి ఆయన సమక్షంలో భారాసలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు.

"కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వడంతో తినే కంచంలో మన్ను పోసుకున్నట్లయింది. సీఎం రేవంత్‌రెడ్డి మాటలన్నీ బోగస్.. 6 గ్యారంటీల్లో ఒక్కటి కూడా పూర్తి చేయలేదు. బస్సుల్లో ఆడవాళ్లు కొట్టుకునే పరిస్థితి వచ్చింది. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పూర్తిగా క్షీణించింది. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలున్న కాంగ్రెస్ నేతలను హైడ్రా ముట్టుకోదు. గత ఎన్నికల్లో ఓటమి భారాస కంటే ప్రజలకే ఎక్కువ నష్టం. కేసీఆర్ మరోసారి సీఎం కావడం చారిత్రక అవసరం. రెండు జాతీయ పార్టీలు తెలంగాణకు శత్రువులే" అని కేటీఆర్ అన్నారు.

## త్వరలోనే ఆర్టీసీలో 3,038 ఉద్యోగాలకు నోటిఫికేషన్: మంత్రి పొన్నం

మొదటి పేజీ తరువాయి
హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. త్వరలోనే 3,038 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. వీటిలో 2 వేల డ్రైవర్ పోస్టులు, 743 శ్రామిక్ ఉద్యోగాలు, 84 డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్), 114 డిప్యూటీ సూపరింటెండెంట్ (మెకానికల్), 25 డిపో మేనేజర్/అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, 18 అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ పోస్టులు, 23 అసిస్టెంట్ ఇంజినీర్ (సివిల్), 11 సెక్షన్ ఆఫీసర్ (సివిల్). 6 అకౌంట్ ఆఫీసర్స్, 7 మెడికల్ ఆఫీసర్స్ జనరల్, 7 మెడికల్ ఆఫీసర్స్ స్పెషలిస్ట్ పోస్టులు ఉంటాయని చెప్పారు.

## అనితర సాధ్యుడు చంద్రబాబుకు వజ్రోత్సవ జన్మదిన శుభాకాంక్షలు: పవన్ కల్యాణ్

మొదటి పేజీ తరువాయి
ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని దేవుణ్ని ప్రార్థిస్తున్నా" అని పవన్‌కల్యాణ్ తెలిపారు.

ఆయురారోగ్యాలతో మరిన్ని పుట్టిన రోజులు చేసుకోవాలి: గవర్నర్

సీఎం చంద్రబాబుకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో మరిన్ని పుట్టినరోజులు నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ఏపీ అభివృద్ధికి ఆయన కృషి కొనసాగాలన్నారు.

రాష్ట్ర ప్రజలకు మార్గదర్శకంగా నిలిచారు: నందమూరి రామకృష్ణ

సీఎం చంద్రబాబుకు నందమూరి రామకృష్ణ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దూరదృష్టి గల నాయకత్వంతో ఆయన రాష్ట్ర ప్రజలకు మార్గదర్శకంగా నిలిచారన్నారు. అభివృద్ధి ప్రదాతగా ఏపీని అభివృద్ధి మార్గంలో నడిపిస్తున్నారని చెప్పారు. ఆయురారోగ్యాలతో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

## బీజేపీ.. బీఆర్ఎస్ లను ఎవరూ నమ్మరు



మొదటి పేజీ తరువాయి
బీఆర్ఎస్ పార్టీ నేతలు గాలిలో మేడలు కడుతున్నారని.. తెలంగాణలో మళ్లీ అధికారంలోకి వస్తామని కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు ఏం చేసిందని కాషాయ నేతలు ఓట్లు అడుగుతున్నారని.. కేంద్ర నుంచి తెలంగాణకు రావలసిన నిధుల్లోఅన్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కూనంనేని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రాష్ట్రానికి ప్రత్యేక నిధులు కేటాయించిన బీజేపీ ప్రభుత్వం.. తెలంగాణకు మాత్రం 2.4 శాతమే ఇస్తూ.. నిబంధనలకు విరుద్ధంగా.. ఏకపక్షంగా కేంద్ర ప్రభుత్వం పాలన ఉందని దుయ్యబట్టారు.

## గిరిజనులను రెచ్చగొట్టవద్దు: మంత్రి సీతక్క

మొదటి పేజీ తరువాయి
ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ సభలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. 44 సంవత్సరాల క్రితం జరిగిన దురదృష్టకర సంఘటన అమరవీరుల గుండెల్లో చెరగని ముద్ర వేసింది. అటవీఅధికారులు సంయమనం పాటించాలంటూ.. గిరిజనులను రెచ్చగొట్టే చర్యలను మానుకోవాలని మంత్రి సీతక్క సూచించారు.

ఏప్రిల్ 20వ తేదీ రాగానే చాలామంది ఈ సంఘటన గుర్తొచ్చి భయం తో వణికిపోతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షునిగా ఉన్న సమయంలో ఆదిలాబాద్ లో స్మృతివనం ఏర్పాటు చేస్తానన్న హామీని నెరవేర్చారన్నారు. గత ప్రభుత్వం అమరవీరులందనికి గుర్తించలేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం అందరిని గుర్తించేందుక ఐటీడీఏ అధికారులతో కమిటి వేస్తామని మంత్రి సీతక్క తెలిపారు. అమరవీరుల కుటుంబాలకు ఐసీడీఎస్.. పంచాయితీ రాజ్ శాఖల్లో ఉద్యోగాలు ఇచ్చి అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఐటిడిఎలు.. పోడు భూముల చట్టం..పీసా.. ఉపాధి హామీ చట్టం అమరవీరుల త్యాగాల వల్లనే వచ్చాయన్నారు.. ఆదివాసీల అభివృద్ధికి కృషి చేస్తామన్న సీతక్క.. ఏజన్సీ ఏరియాల్లో గిరిజనులకు ఉద్యోగాలిచ్చే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. మహిళలకు వడ్డీలేని రుణాలను మంజూరు చేస్తామని... ఇప్పపువ్వు లడ్డూలతో విద్యార్థులకు ఎనిమియా దూరం అవుతుందన్నారు. సర్వే జరగని భూములకు సర్వే చేసి.. పట్టాలిస్తామన్నారు.

# భూ భారతి ద్వారా పెండింగ్ లో ఉన్న సాదా బైనమా దరఖాస్తుల క్రమబద్ధీకరణ

**- వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ కు భూమి పటం**

**- అవగాహన సదస్సులలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడి**





**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 20 :** రైతులకు వారి భూములపై సమగ్ర హక్కులు కల్పించాలనే కృత నిశ్చయంతో ప్రభుత్వం భూ భారతి (నూతన ఆర్.ఓ.ఆర్) - 2025 చట్టాన్ని తెచ్చిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పష్టం చేశారు. ముఖ్యంగా ధరణి ద్వారా పరిష్కారానికి అవకాశం లేకుండాపోయిన అనేక సమస్యలకు భూభారతి కొత్త చట్టం పరిష్కారం కల్పిస్తుందని అన్నారు. ఈ మేరకు రైతులకు వెసులుబాటు కల్పిస్తూ, కీలక అంశాలను కొత్త ఆర్ ఓ ఆర్ చట్టంలో పొందుపర్చారని సూచించారు. భూ భారతి చట్టంపై ఆదివారం ఆలూర్, డొంకేశ్వర్ మండల కేంద్రాలలో అవగాహన సదస్సులు నిర్వహించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఒక్కో అంశం వారీగా రైతులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పెండింగ్ లో ఉన్న సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు త్వరలో జారీ కానున్నాయని అన్నారు. 2014 జూన్ 2వ తేదీ కంటే ముందు గ్రామీణ ప్రాంతంలోని వ్యవసాయ భూమిని సాధాబైనామా ద్వారా కొనుగోలు చేసి, గడిచిన పుష్కర కాలంగా అనుభవంలో ఉంటూ, 2020 అక్టోబర్ 12 నుండి నవంబర్ 10వ తేదీ మధ్య కాలంలో క్రమబద్ధీకరణ కోసం రైతులు పెట్టుకున్న దరఖాస్తులను ఆర్డీఓ లు విచారణ చేసి, అర్హత కలిగిన వారి సాధాబైనామాలను క్రమబద్ధీకరిస్తారని తెలిపారు. పిఓటి, ఎల్.టి.ఆర్, సీలింగ్ చట్టాల ఉల్లంఘనలు లేనివి క్రమబద్ధీకరణ చేసే నాటికి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని అన్నారు. హక్కుల రికార్డులు, భూమి వివరాలను నమోదు చేసి పాస్ బుక్ జారీ చేస్తారని వివరించారు. ధరణి లో సాధాబైనామా క్రమబద్ధీకరణకు అవకాశం ఉండేది కాదన్నారు.

ప్రస్తుతం ధరణి లో ఉన్న భూ రికార్డులు భూ భారతి చట్టంలో కొనసాగుతాయని తెలిపారు. భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అర్హులైన వారు నూతన చట్టం అమల్లోకి వచ్చిన ఏడాది కాలం లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఆ దరఖాస్తులను పరిశీలించి రెవెన్యూ డివిజన్ అధికారి, జిల్లా కలెక్టర్ ఒక నిర్ణయం తీసుకుంటారని అన్నారు. దరఖాస్తుదారునికి ఏమైనా అభ్యంతరాలు ఉంటే కలెక్టర్ స్థాయిలో అప్పీల్ చేసుకోవచ్చని, అక్కడ కూడా సంతృప్తి చెందకపోతే ల్యాండ్ ట్రిబ్యూనల్ లో అప్పీల్ చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఇదివరకు అప్పీల్ వ్యవస్థ ఉండేది కాదని, భూ వివాదాలపై సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని గుర్తు చేశారు. దీనివల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గమనించిన ప్రభుత్వం, అధికారుల స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం లభించాలనే ఉద్దేశ్యంతో రెవెన్యూ కోర్టులను భూభారతి చట్టం ద్వారా పునరుద్ధరించిందని తెలిపారు. చిన్న, సన్నకారు, పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తారని తెలిపారు.

భూమి మ్యూటేషన్ కోసం అర్జీలు అందించవచ్చని, భూభారతి పోర్టల్ లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. వారసత్వ ఒప్పంద పత్రం, వీలునామా కాపీ, నిర్దేశించిన తేదీ నుంచి భూమి సర్వే పటం జత చేయాలని, ఈ దరఖాస్తుల పై తహసిల్దార్ 30 రోజుల్లోగా విచారణ చేపట్టి నిర్ణయం తీసుకుంటారని అన్నారు. గడువు లోపు పరిష్కరించకపోతే దానంతటఅదే మ్యూటేషన్ జరిగిపోతుందని అన్నారు.

వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ఒకే రోజు ఉంటాయని అన్నారు. కొనుగోలు, దానం, తనఖా, బదిలీ, భాగం పంపకాల ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసిల్దార్ రిజిస్ట్రేషన్ చేసి హక్కుల రికార్డులు మార్పులు చేసి పట్టాదార్ పాస్ పుస్తకం జారీ చేస్తారని తెలిపారు. 300 రూపాయల ఫీజుతో పాస్ బుక్ జారీ చేస్తారని అన్నారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి, ప్రతి సంవత్సరం గ్రామాలలో రికార్డు డిస్ ప్లే చేయడం జరుగుతుందని అన్నారు. ఆధార్ కార్డు తరహాలోనే భూమికి సంబంధించిన వివరాలతో రైతులకు భూదార్ సంఖ్యను కేటాయిస్తారని, దీని ద్వారా భూ ఆక్రమణలకు చెక్ పడుతుందని అన్నారు. భూ భారతి చట్టంపై రైతులు వెలిబుచ్చిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ సదస్సులలో ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, స్థానిక అధికారులు, మార్కెట్ కమిటీలు, సొసైటీల చైర్మన్ లు, రైతులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 20 :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో రైతు మహోత్సవం ప్రారంభోత్సవ కార్యక్రమం ఉండడంతో ఈ నెల 21న జరగాల్సిన ప్రజావాణిని వాయిదా వేశామని అన్నారు. ఈ నెల 28వ తేదీ నుంచి తిరిగి యధావిధిగా ప్రతి సోమవారం ప్రజావాణి కొనసాగుతుందని సూచించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.

## అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

**- టిపిసిసి నాయకులు కొమిరెడ్డి కరంచంద్**



**మెట్ పల్లి (మన వెలుగు) ఏప్రిల్ 20 :** శుక్రవారం కురిసిన అకాల వర్షాలు, గాలి వానలకు నష్టపోయిన మామిడి, మొక్కజొన్న, సజ్జ, నువ్వులు, వరి పంట రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని రైతులు అధైర్యపడవద్దని టిపిసిసి సీనియర్ నాయకులు కొమిరెడ్డి కరంచంద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం మెట్పల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కరంచంద్ మాట్లాడుతూ....జరిగిన పంట నష్టాన్ని వ్యవసాయ శాఖ మంత్రి ఉన్నతాధికారులతో మాట్లాడి వ్యవసాయ క్షేత్రాలలో సర్వే చేయించి పంట నష్టం అంచనాలపై ఖచ్చితమైన నివేదిక రూపొందిస్తున్నారని నష్టపోయిన ప్రతి ఒక్క రైతుకు పంట నష్ట పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం పార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్ హఫీజ్, ఎర్రోళ్ల హనుమాన్లు యాదవ్, యామ రాజయ్య, డాక్టర్ బెజ్జారాపు శ్రీనివాస్, పెంట ప్రణయ్ తేజ సురేష్, పొన్నల ఎలేష్, బండి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు





**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 20 :** అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అగ్నిమాపక కేంద్రంలోని అన్ని పరికరాలు క్లుప్తంగా పరిశీలించారు. స్కూలు విద్యార్థులకు ఎస్సే రైటింగ్, డ్రాయింగ్ కాంపిటీషన్ పిల్లలకు బహుమతులు అందజేశారు. రిటైర్ అయిన ఫైర్ ఆఫీసర్లను, లీడింగ్ ఫైర్ మేలు ఫైర్ మాన్లకు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అగ్ని ప్రమాదాలు ఎలా ఎక్కడ సంభవిస్తాయో తెలియదని అన్నారు. మన ఇంట్లో కానీ, మనం కూర్చునే కారులో కానీ, మనం ఇక్కడ కూర్చున్న గాని ఎక్కడ ఉన్న కానీ అగ్నిప్రమాదం సంభవించవచ్చని అన్నారు. దానికంటే ముందు మనం ఫైల్ ప్రికాషన్స్ ఫైర్ సేఫ్టీ మెజర్స్ కంపల్సరీ బిగించుకోవాలన్నారు. కంపల్సరీ పాటించాలన్నారు. ఫైర్ సేఫ్టీ పాటించాలని సూచించారు. అందరూ తప్పకుండా ఫైర్ సేఫ్టీని వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ టి. పరమేశ్వర్, ఫైర్ ఆఫీసర్ పి.నర్సింగ్ రావ్, ఆర్మూర్ ఫైర్ ఆఫీసర్ మధుసూదన్, ఐఎన్డీడీఎఎల్, ఫైర్ ఆఫీసర్ విక్రమ్ పాల్గొన్నారు.

## బైక్‌ను తప్పించబోయి.. ఆర్టీసీ బస్సు బోల్తా.. పలువురికి గాయాలు

మేళ్లచెరువు: సూర్యాపేట జిల్లా చింతలపాలెం వద్ద ఆర్టీసీ బస్సు బోల్తాపడింది. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. బైక్‌ను తప్పించే క్రమంలో ఆర్టీసీ బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. అక్కడే ఉన్న స్థానిక యువకులు బస్సులో చిక్కుకున్న ప్రయాణికులను బయటకు తీసి.. హుజూర్‌నగర్, కోదాడ ఏరియా ఆస్పత్రులకు తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో 15 మంది ప్రయాణికులు ఉన్నారు. ఆర్టీసీ బస్సు కోదాడ నుంచి చింతలపాలెం వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది.

## నిరుపేదల పాలిట వరం ఉచిత మెగా వైద్య శిబిరం



**- డాక్టర్ బెజ్జారపు శ్రీనివాస్**



**మెట్ పల్లి (మన వెలుగు) ఏప్రిల్ 20 :** స్వర్గీయ కొమిరెడ్డి రాములు జ్యోతక్కల జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం మెట్పల్లి పట్టణంలోని శ్రీ సాయి శ్రీనివాస హాస్పిటల్ లో ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారి తనయులు టీపీసీసీ నాయకులు కొమిరెడ్డి కరంచంద్ విజయ్ ఆజాద్ లు పార్టీ నాయకుల తో పాటు వైద్యులు ఆసుపత్రి సిబ్బంది మధ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ మేరకు కొమిరెడ్డి కరంచంద్ మాట్లాడుతూ.. సాయి శ్రీనివాస హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ బెజ్జారపు శ్రీనివాస్ తో తమ కుటుంబానికి రాజకీయాలకతీతంగా వ్యక్తిగత అనుబంధం ఉన్నదని, తమ తల్లిదండ్రులను శ్రీనివాస్ పెద్దనాన్న, పెద్దమ్మ అంటూ సంభోదించే%శీ%త చనువుతో కూడిన సాన్నిహిత్యం తమ మధ్య ఉందని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం పరితపించిన తమ తల్లిదండ్రులు కొమిరెడ్డి రాములు జ్యోతక్కలను ఆదర్శంగా తీసుకొని నేడు వారి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవడం ఆనందంగా ఉన్నదని అన్నారు. ప్రజా శ్రేయస్సు కోరి తరచూ నిర్వహించే ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిరుపేదలు బడుగు బలహీన వర్గాల వారెం దరికో ఉపయోగపడుతు న్నాయని కరంచంద్.. శ్రీనివాసును అభినందించారు. అనంతరం శిబిరానికి వచ్చిన ప్రజలకు డాక్టర్లు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరాన్ని ముందుగా నే సందర్శించిన కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జి జువ్వాడి నరసింగరావు.. బిజీ షెడ్యూల్ మూలంగా మల్లాపూర్ బయలుదేరారు. కాగా నిర్వాహకుడు డాక్టర్ బెజ్జారపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్వర్గీయ మాజీ ఎమ్మెల్యేలు కొమిరెడ్డి రాములు, జ్యోతక్కల సామాజిక సేవ దృక్పథాన్ని ఆదర్శంగా తీసుకున్న తాను ప్రజల శ్రేయస్సు కోరి తరచూ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నానని అన్నారు. అనంతరం కొమిరెడ్డి కరంచంద్, విజయ ఆజాద్ లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ స్థానిక వైద్యులు గంగాసాగర్, కాంటినెంటల్ ఆసుపత్రి వైద్యులు మల్లు అరుణ్ రెడ్డి, తిరుమల నరేష్, మల్లిక్ సింగరాజు, ఆసుపత్రి వైద్యులు లక్ష్మణ్, పట్టణ పార్టీ అధ్యక్షులు జట్టిలింగం, సీనియర్ నాయకులు అబ్దుల్ హఫీజ్. ఎర్రోళ్ల హనుమాన్ల యాదవ్. యామరాజయ్య. సురేష్. చిదుకు కృష్ణ, పెంట ప్రణయ్ తేజ, కంతి హరికుమార్, బండి నాగరాజు, పొన్నాల ఎల్లేష్ తదితరులు ఉన్నారు.

## నారాయణపేటలో పోలీసుల తనిఖీలు

**నారాయణపేట ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 20 :**



నారాయణపేట పట్టణం లోని పలు కూడళ్లలో పోలీసులు వాహనాల తనిఖీలు,మరియు డ్రంకెన్ డ్రైవ్ చేశారు వాహనాలకు సంబంధించిన పలు పత్రాలను పరిశీలించారు, సరియైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేసి జరిమానా వేసి టానాకు తరలించారు, బ్రీత్ అనలైజర్ ద్వారా మద్యం సేవించి వాహనాలు నడపే వారిని గుర్తించి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోబడతాయని ఈ విధంగా డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారిపై నలుగురిపై కేసులు నమోదు చేశామని ఏఎస్ఐ అంజలయ్య తెలిపారు మద్యం సేవించి వాహనాలు నడపరాదని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు


## కొడంగల్ నియోజకవర్గం ఇంచార్జి ప్రతాప్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు

**నారాయణపేట ప్రతినిది (మన వెలుగు) ఏప్రిల్ 20 :** రాష్ట్ర బిజెపి నాయకులు కొడంగల్ నియోజకవర్గ ఇన్చార్జి మరియు కోస్గి పట్టణ నాయకులు నాగుల పల్లి ప్రతాప్ రెడ్డికి అన్ని పార్టీల నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతాప్ రెడ్డి మృదుస్వభావి నిత్యం ప్రజల కోసం పరితపించే నాయకుడు,ప్రజా సంక్షేమమే తన పరమావధిగా భావించి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ పేద ప్రజలకు అండగా ఉంటున్నటు వంటి నాయకులు బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి నాగులపల్లి ప్రతాప్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు. భగవంతుడు మంచి ఆరోగ్యాన్ని ఇచ్చిఇంకా ఎన్నో ఉన్నత పదవులు సాధించాలని ప్రజల కోసం ఇంకా పనిచేసే విధంగా అభగవంతుడు శక్తిని ప్రసాదించాలని ప్రార్థిస్తూన్నామని మరియు శుభాకాంక్షలు తెలిపిన వారిలో



ప్రింట్ మీడియా మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## : క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో యువకుడి మృతి



కీసర: మేడ్చల్ జిల్లా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో విషాదం చోటు చేసుకుంది. రాంపల్లి దాయరలో క్రికెట్ ఆడుతూ గ్రౌండ్‌లోనే ప్రణీత్ (32) అనే యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు. అతడిని పాత బోయినపల్లికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. త్యాగి స్పోర్ట్స్ వెన్యూ గ్రౌండ్‌లో క్రికెట్ అడుతుండగా అతడికి గుండెపోటు వచ్చింది. అప్రమత్తమైన సహచర ఆటగాళు వెంటనే ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఈ ఘటనతో మృతుడి కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

# గొప్ప విజనరీ నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు

**- రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కోసం చంద్రబాబు నిండు నూరేళ్ళు జీవించాలి**
**- భవాని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 8 లక్షలతో ఆర్టీసీ కాంప్లెక్స్... ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు**
**- తండ్రి పుట్టినరోజున కొడుకు లోకేష్ ఇచ్చిన కానుక మెగా డీఎస్సీ**
**- 16,437 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్**
**- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్... మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు**

రాజమహేంద్రవరం :
గొప్ప విజనరీ నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడని, రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు నిండు నూరేళ్ళు జీవించాలని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ఆకాంక్షించారు. సీఎం చంద్రబాబు 75వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఆదివారం రాజమండ్రి నగరంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పలు అభివృద్ధి కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు చేపట్టారు.
మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, పరిశీలకులు బొళ్ల ప్రసాద్ తదితరులతో ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రయాణికులు... కార్మికుల కోసం, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు... వారి బంధువులు కోసం రూ. 8 లక్షలతో రెండు ఆర్వో ప్లాంట్లను ప్రారంభించారు. అలాగే 4వ డివిజన్లో



తాడేపల్లి గూడెం పరిశీలకులు నక్కా చిట్టిబాబు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవివరప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాలను భారీ ర్యాలీగా వెళ్లి ఆవిష్కరించి సుమారు 300 మంది పేదలకు అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ చంద్రబాబు పుట్టినరోజున తమ భవానీ చారిటబుల్ ట్రస్టు, తన మిత్రుల సహకారంతో రూ. 8 లక్షలతో ఆర్టీసీ కాంప్లెక్స్ లో ఒకటి , రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలో మరో ఆర్వో ప్లాంటును ప్రారంభించామని చెప్పారు. అలాగే ఆసుపత్రిలోని రోగులకు రొట్టెలు పంపిణీ చేసినట్లు తెలిపారు. అభివృద్ధి ప్రదాత, సంపద సృష్టికర్త చంద్రబాబు అని ,ఆయన హయాంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చేందాలనేది తమ స్వార్ధం అని అన్నారు. గొప్ప విజనరీ నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ఎమ్మెల్యేగా పని చేయడం తన అదృష్టమని ఆయన అన్నారు. తండ్రి చంద్రబాబు పుట్టినరోజున కొడుకు విద్య,మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ నిరుద్యోగులకు డిఎస్సీ నోటిఫికేషన్ కానుకగా ఇచ్చారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పేర్కొన్నారు. గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయలేదని ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయలేదని విమర్శించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 16,437 పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందని ఆయన చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు పెడుతోందని అన్నారు. గత ఐదేళ్ల బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ రుణాలు లేవని, కానీ ఇప్పుడు అన్ని వర్గాల వారికి రుణాలు మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు గుర్తు చేశారు. కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం త్వరలో ప్రారంభం అవుతుందని తెలిపారు. భవిష్యత్తు తరాల బాగు కోసం కూటమి పాలన సాగుతోందని సగర్వంగా ఆయన ప్రకటించారు.

4వ వార్డులో ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాలు ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి
నగరంలోని 4వ వార్డులో తాడేపల్లిగూడెం పరిశీలకులు నక్కా చిట్టిబాబు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవీ ప్రసాద్ ఆధ్వర్యంలో నెల కొల్పిన ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాల ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజున టీడీపీ వ్యవస్థాపకుడు అన్న నందమూరి తారక రామారావు విగ్రహాన్ని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరించడం గొప్ప విషయమన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబు ఈ ఇరువురు నాయకులు తెలుగు జాతికి గర్వకారణమని కొనియాడారు. తెలుగుదేశం, కూటమి పాలనలోమాత్రమే అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి సాధించాలి..

**-వేణుగోపాలస్వామి ఆలయంలో యర్రా వేణు పూజలు**

రాజమండ్రి:
నవ్యాంధ్రప్రదేశ్ సృష్టికర్త, విజనరీ లీడర్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంపూర్ణ ఆయురారోగ్యాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి యర్రా వేణుగోపాల రాయుడు ఆకాంక్షించారు. చంద్రబాబు 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరంలో వేంచేసి ఉన్న క్షేత్రపాలకుడు శ్రీ రుక్మిణి సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఆయన టిడిపి నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయురారోగ్యాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే శక్తిని ఇవ్వాలని కోరుతూ వేద పండితులతో పూజలు చేయించారు. అనంతరం యర్రా వేణు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సమర్థవంతంగా ముందుకు నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రానున్న రోజుల్లో మరింత ప్రగతి సాధిస్తుందన్నారు ఆయన నాయకత్వంలో కలల రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు, నదుల అనుసంధానంలో భాగంగా బనకచర్ల పూర్తి చేసేందుకు ఆ క్షేత్రపాలక వేణుగోపాల స్వామి శక్తిని అందజేయాలని కోరి ప్రార్థించామన్నారు. అటువంటి నాయకుడి నాయకత్వంలో తాము ముందుకు సాగడం చాలా గర్వకారణంగా ఉందన్నారు. తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజలకు సేవలు అందించడం ద్వారా రాష్ట్రాన్ని ముందుకు నడిపించడంలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని అన్నారు. చంద్రబాబు రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు తొలగించి అన్ని వర్గాల ప్రజలు సమానత్వంతో జీవించేలా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చాలా మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించాలని కోరి ప్రార్థించామన్నారు. ప్రత్యేక పూజల అనంతరం టిడిపి నాయకులకు వేద పండితులు వేదా ఆశీర్వచనం అందజేశారు. ఆయన వెంట రాజమండ్రి ఛాంబర్ అధ్యక్షుడు తవ్వా రాజా, మాజీ కార్పొరేటర్లు మాటూరి రంగారావు, ఇన్నమూరి రాంబాబు, డాక్టర్ కొమ్మ శ్రీనివాస్, టిడిపి నాయకులు శెట్టి జగదీష్, చించినాడ తాతాజీ, మాటూరి సిద్ధార్థ, కర్రి కాశీ విశ్వనాథ్, నల్లం ఆనంద్, సానా దుర్గాప్రసాద్, బ్రింగు మళ్ల నారాయణ, చొక్కాకుల శ్రీనుబాబు, పూర్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చంద్రబాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వీరభద్రపురంలో ఉన్న గాంధీ కస్తూరిబా ఆశ్రమంలో వృద్ధులకు భోజనాలు వితరణ చేశారు.

## వక్ఫ్ చట్టం మార్పులతో ముస్లింలకు రక్షణ

**పేదల ఆస్తుల పరిరక్షణే కేంద్ర లక్ష్యం.**
**బోర్డు అవినీతికి అడ్డుకట్ట వేయనున్న నూతన చట్టం.**
**బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి .**
**ఖమ్మం వేదికగా వక్ఫ్ చట్ట అవగాహన సదస్సు.**

ఒక్క ముస్లింల ఆస్తులే కాదు వారి గౌరవం, భద్రత, హక్కుల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో వక్ఫ్ చట్టం మార్పులు ప్రముఖపాత్ర పోషిస్తున్నాయని బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం నాడు ఖమ్మం నగరంలో జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఏర్పాటుచేసిన మినార్ గ్రాండ్ హెూటల్లో జరిగిన "వక్ఫ్ చట్టంపై అవగాహన సదస్సు"లో బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు టెలిఫోన్ లో వీడియో కాలింగ్ ద్వారా మాట్లాడుతూ..వక్ఫ్ బోర్డు గతంలో కొందరి చేతుల్లో ఒక సంస్థగా మారింది. వాస్తవానికి అది పేద ముస్లింల ఆస్తుల పరిరక్షణకు పనిచేయాల్సింది. అయితే పాత చట్టంలోని లోపాలు, వ్యవస్థల్లో ఉన్న అక్రమాలు కారణంగా లక్షల కోట్ల విలువైన భూములు ఆక్రమితుల చేతిలోకి వెళ్లాయి. ఇప్పుడు తీసుకొచ్చిన సవరణల ద్వారా ఈ దుస్థితికి పూర్తిగా అడ్డుకట్ట పడుతుంది," అని ఆయన వివరించారు.కొత్త చట్టంతో వక్ఫ్ బోర్డు అధికారాలు పారదర్శకంగా వినియోగించబడతాయని, డిజిటల్ ఆధారాలతో రికార్డులను ప్రజల ముందుంచే వ్యవస్థ ఏర్పాటవుతుందని ఆయన తెలిపారు."బీజేపీ ప్రభుత్వం ముస్లింల పట్ల నిబద్ధత చూపించడంలో వెనుక పడలేదు. మైనారిటీ సంక్షేమం మా ప్రభుత్వ ప్రాధాన్యతలలో ఒకటి," అని పొంగులేటి వ్యాఖ్యానించారు. "ప్రస్తుతం వక్ఫ్ బోర్డులపై నమ్మకం తగ్గిపోవడానికి ప్రధాన కారణం %-% రికార్డుల లోపాలు, విచారణల లేటుగా నడవటం, బోర్డు సభ్యుల నియామకాల్లో పారదర్శకత

# రాష్ట్ర రథసారథి నిండు నూరేళ్లు ప్రజా సేవకునిగా వెలగాలి

**చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి సాధించాలి**
**శ్రీ గణపతి ప్రయోక్త విజయ దుర్గంబిక ఆలయంలో తెలుగు మహిళలు పూజలు**

రాజమహేంద్రవరం
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రథసారథి నిండు నూరేళ్ల ప్రజా సేవకునిగా వెలుగొందాలని, నవ్యాంధ్రప్రదేశ్ సృష్టికర్త, విజనరీ లీడర్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంపూర్ణ ఆయురారోగ్యాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని రాజమండ్రి పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి ఆకాంక్షించారు. చంద్రబాబు 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరంలో 4వ వార్డులో వేంచేసి ఉన్న శ్రీ గణపతి ప్రయోక్త విజయ దుర్గంబిక ఆలయంలో రాజమండ్రి నగర మహిళా అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ మరియు ఇతర మహిళ టిడిపి నాయకురాళ్లతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయురారోగ్యాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే శక్తిని ఇవ్వాలని కోరుతూ అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. అనంతరం మాలే విజయలక్ష్మి మాట్లాడుతూ గొప్ప విజనరీ నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సమర్థవంతంగా ముందుకు నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రానున్న రోజుల్లో మరింత ప్రగతి సాధిస్తుందన్నారు ఆయన నాయకత్వంలో కలల రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు, పూర్తి చేసేందుకు ఆ శక్తిని శ్రీ గణపతి ప్రయోక్త విజయ దుర్గంబిక అమ్మవారు అందజేయాలని కోరి



ప్రార్థించామన్నారు. అటువంటి నాయకుడి నాయకత్వంలో తాము ముందుకు సాగడం చాలా గర్వకారణంగా ఉందన్నారు. తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజలకు సేవలు అందించడం ద్వారా రాష్ట్రాన్ని ముందుకు నడిపించడంలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని అన్నారు. చంద్రబాబు రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు తొలగించి అన్ని వర్గాల ప్రజలు సమానత్వంతో జీవించేలా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చాలా మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించాలని కోరి ప్రార్థించామన్నారు.
ఈ కార్యక్రమంలో రాజమండ్రి పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి రాజమండ్రి నగర మహిళా అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, రాష్ట్ర అంగన్వాడీ అధికార ప్రతినిధి కప్పల వెలుగు కుమారి, అంగన్వాడి అధ్యక్షురాలు బోను ఈశ్వరి, శ్రీలత, లక్ష్మీ నాయుడు, విజయ, పీ లక్ష్మి, డి నాగమణి, బర్ల గిరిజ, బి నాగలక్ష్మి, మేరి అరుణ, కల్పన, సాయి కనకదుర్గ అధిక సంఖ్యలో మహిళ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## పాఠశాలకు నిధులు మంజూరు చేయాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ వినతిపత్రం సమర్పించిన బిజెపి మండల ఉపాధ్యక్షుడు దత్తాద్రి గౌడ్



నిజామాబాద్ జిల్లా జక్రాన్ పల్లి
మండలంలోని పడకల్ పాఠశాలకు నిధులు మంజూరు చేయాలని పట్టబద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డికి వినతిపత్రం సమర్పించినట్లు మండల బిజెపి ఉపాధ్యక్షుడు దత్తా గౌడ్ తెలిపారు. నిజాంబాద్ లో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి హాజరైనటువంటి ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ కొమురయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తమ పాఠశాలకు నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్, మండల అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ముప్కాల్ మండల కేంద్రంలో బిఆర్ఎస్ 25వ రజతోత్సవ సన్నాక సమావేశం..

ఈరోజు ముప్కాల్ మండల కేంద్రంలో బిఆర్ఎస్ అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ






సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు భూమేశ్వర్ రెడ్డి, ముప్కాల్ తాజా మాజీ మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు సామ పద్మా, వెంకట్ రెడ్డి మరియు బి ఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జోషి ఉమాశంకర్ గారు మాట్లాడుతూ ఈ నెల 27న బి ఆర్ఎస్ 25 వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు ( రజతోత్సవం ) భారీ బహిరంగ సభ వరంగల్ లో నిర్వహించడం జరుగుతుందని కావున మండల కేంద్రం పరిధిలోని గ్రామాల కార్యకర్తలు హాజరై బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం భారీ బహిరంగ సభ వాల్పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచులు, తాజా మాజీ ఎం.పీ.టీసీ.లు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, బిఆర్ఎస్ యువ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు నిధులు మంజూరు చేయాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ వినతిపత్రం సమర్పించిన బిజెపి మండల ఉపాధ్యక్షుడు దత్తాద్రి గౌడ్




మండలంలోని పడకల్ పాఠశాలకు నిధులు మంజూరు చేయాలని పట్టబద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డికి వినతిపత్రం సమర్పించినట్లు మండల బిజెపి ఉపాధ్యక్షుడు దత్తా గౌడ్ తెలిపారు. నిజాంబాద్ లో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి హాజరైనటువంటి ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ కొమురయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తమ పాఠశాలకు నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్, మండల అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

# వేటకు సిద్ధమైన డ్రాగన్..

## రామోజీ ఫిలింసిటీలో ఫస్ట్ షెడ్యూలు కంప్లీట్.. మంగళూర్ లో యాక్షన్ సీన్స్

మ్యాన్ ఆఫ్ మాసెస్.. యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కు కిక్కిచ్చే వార్త. వార్-2 సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ఎన్టీఆర్.. 2025 ఆగస్టు 14న ఆ సినిమాను రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. వార్2 షూటింగ్ పూర్తవ్వడంతో.. తదుపరి మూవీపై దృష్టి పెట్టింది మూవీ టీమ్. ఈ సందర్భంగా ప్రశాంత్ నీల్-ఎన్టీఆర్ కాంబోలో తెరకెక్కనున్న అప్ కమింగ్ మూవీ నుంచి బిగ్ అప్ డేట్ వచ్చింది.ప్రశాంత్ నీలో-ఎన్టీఆర్ కాంబోలో వస్తున్న మూవీకి టెంటేటివ్ గా 'డ్రాగన్' అనే పేరును ఫిక్స్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఎన్టీఆర్ వార్-2 షూటింగ్ లో బిజీగా ఉండటంతో.. రామోజీ ఫిలింసిటీలో ఎన్టీఆర్ లేకుండా ఉండే ఇతర సీన్స్ కొన్ని కంప్లీట్ చేశాడు నీల్. ఇప్పుడు అందుబాటులోకి రావడంతో.. మంగళూర్ లో మరో షెడ్యూల్ కు సిద్ధం అయ్యింది మూవీ టీమ్.అందుకోసం



ఎన్టీఆర్ ఇవాళ (ఏప్రిల్ 20) కర్ణాటకకు బయలుదేరాడు. హైదరాబాద్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ లో వెళ్తున్న ఫోటోలు బయటకు వచ్చాయి. ప్రొడ్యూసర్స్ నవీన్ ఎర్నేని, రవిశంకర్ లతో కలిసి బెంగళూరు వెళ్లారు. మంగళవారం మంగళూరుని కుంటా ప్రాంతంలో షూట్ మొదలవుతుంది. అక్కడ సీక్వెన్స్ యాక్షన్ సీన్స్ షూట్ చేయనున్నారు.అయితే ఈ సినిమాలో రుక్మిణీ వసంత్ ఫిమేల్ లీడ్ లో నటించనున్నట్లు ర్యూమర్స్ వస్తున్నాయి. అయితే సినిమా కాస్టింగ్ గురించి అఫీషియల్ గా మూవీ టీమ్ కన్ఫామ్ చేయలేదు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నాయి. రవి బస్రూర్ మ్యూజిక్ కంపోజ్ చేస్తున్న ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేయనున్నారు.



# ఈ యుద్ధంలో గొప్పవారిదే గెలుపు

తెరపై ప్రత్యేక పాటలతో కుర్రకారుని ఉర్రూతలూగిస్తూనే.. మరోవైపు కొత్తదనం నిండిన కథలతో ప్రేక్షకుల్ని మెప్పిస్తుంటుంది అందాల తార జాక్వెలిన్ ఫెర్నాండెజ్. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న సిరీస్ 'హై జునూన్'. నీల్ నితిన్ ముఖేశ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ మ్యూజికల్ డ్రామాకు అభిషేక్ శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సిరీస్‌ను అధికారికంగా ప్రకటిస్తూ.. విడుదల తేదీని పంచుకుంది సిరీస్ బృందం. "మొండితనం.. ప్యాషన్‌ల మధ్య జరిగే యుద్ధంలో గొప్పవారు మాత్రమే గెలుస్తారు" అని వ్యాఖ్యల్ని జోడించింది. రెండు మ్యూజిక్ క్లబ్‌ల మధ్య పోటీ చుట్టూ ఈ సిరీస్ కథ తిరుగుతుంది. జియో క్రియేటివ్ ల్యాబ్స్ ప్రొడక్షన్ నిర్మించిన ఈ సిరీస్‌లో సిద్ధార్థ్ నిగమ్, సుమేద్ ముద్గల్కర్ తదితరులు నటిస్తున్నారు. మే 16న రానుంది సిరీస్.




# ప్రియాంక, పృథ్వీరాజ్‌తో పడవలో పోరుకు మహేశ్?

కథానాయకుడు మహేశ్‌బాబు.. దర్శకుడు రాజమౌళి కలయికలో ఓ బహుభాషా చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు. 'ఎస్ఎస్ఎంబీ29' వర్కింగ్ టైటిల్‌తో ముస్తాబవుతున్న ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. కాగా, ఈ చిత్ర తదుపరి షెడ్యూల్‌లో భాగంగా నీటిలో ఓ భారీ బోట్ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ షెడ్యూల్‌లో మహేశ్, ప్రియాంక, పృథ్వీరాజ్‌తో పాటు దాదాపు 3వేల మంది జూనియర్ ఆర్టిస్టులు పాల్గొననున్నారని.. దీనికోసం వీళ్లంతా ప్రత్యేకంగా సన్నద్ధం అవనున్నారని తెలుస్తోంది. మే నుంచి జూన్ వరకు ఈ సీక్వెన్స్‌ను చిత్రీకరించనున్నారట. దీనికోసం ప్రస్తుతం హైదరాబాద్‌లో ఓ భారీ సెట్‌ను సిద్ధం చేస్తున్నారని.. ప్రముఖ హాలీవుడ్ స్టంట్ డైరెక్టర్స్ నేతృత్వంలో ఈ పోరాట ఘట్టాన్ని తెరకెక్కించనున్నారని తెలిసింది. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందుతున్న ఈ సినిమా ప్రపంచాన్ని చుట్టేసే ఓ సాహసికుడి కథగా ఉండనుంది. ఈ చిత్రానికి కీరవాణి సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. విజయేంద్రప్రసాద్ కథ, దేవా కట్టా సంభాషణలు అందిస్తున్నారు.

# డబ్బు.. స్టార్‌డమ్ కంటే అద్దే ముఖ్యం!

ప్రేక్షకులకు వినోదం పంచడానికి ఎన్నో ప్రయోగాత్మక పాత్రల్లో నటించే ఎందరో అగ్ర హీరోల తెర వెనక విషాదాల గురించి తక్కువ మందికి తెలుసు. ప్రముఖ హిందీ హీరో షారుక్‌ఖాన్ జీవితంలోనూ ఇలాంటి విషాదమే ఉంది. త్వరలో 'కింగ్' సినిమాతో తెరపైకి రాబోతున్న ఆయన.. తన జీవితంలో జరిగిన ఓ సంఘటన గురించి ఓ సందర్భంలో అభిమానులతో పంచుకున్నారు. "నా తల్లిదండ్రుల మరణం నా సోదరిపై తీవ్ర ప్రభావం చూపింది. నాకింకా గుర్తుంది.. ఆ రోజు నా తండ్రి మృతదేహం ముందు నిలబడి ఆమె కనీసం ఏడ్వలేదు. దాదాపు రెండేళ్ల వరకూ ఆమె ఆ పరిస్థితి నుంచి బయటికి రాలేకపోయింది. అందుకే నేను తనలా డిప్రెషన్‌కు గురికాకుండా ఉండటానికి సినిమాల్లో బిజీ అవుతూ ఉంటా. అందుకే జీవితంలో డబ్బు, స్టార్‌డమ్ కంటే ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉండడమే ముఖ్యం" అని చెప్పుకొచ్చారు.



# 'ఏమాయ చేసావె'.. యాక్టింగ్ చూస్తే సిగ్గుగా అనిపిస్తుంది: సమంత

ప్రేక్షకులకు మంచి కంటెంట్ ఉన్న చిత్రాలను అందించాలనే లక్ష్యంతో సినీ నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టారు నటి సమంత. ఆమె నిర్మాతగా వ్యవహరించిన తొలి చిత్రం 'శుభం'. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా శనివారం సాయంత్రం జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమ సినిమాలో ప్రధాన నటీనటులందరూ కొత్తవారే అని చెప్పిన ఆమె.. వారి యాక్టింగ్ తనని ఎంతో కదిలించిందన్నారు. భవిష్యత్తులో వారందరూ ఉన్నత స్థాయికి వెళ్లాలని కోరుకున్నారు."తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ కంటెంట్‌కు పెద్ద పీట వేస్తారు. మంచి కథ ఉన్న చిత్రాలను వారు ఆదరిస్తుంటారు. మనసుని హత్తుకునే కంటెంట్‌తో సిద్ధమైన మా చిత్రాన్నీ వారు ఆదరిస్తారని కోరుకుంటున్నా. నటీనటులందరూ కొత్తవారే అయినప్పటికీ.. అద్భుతంగా యాక్ట్ చేశారు. వారి నటన నాకెంతో నచ్చింది. నటిగా నా కెరీర్ మొదలుపెట్టినప్పుడు యాక్టింగ్ గురించి పెద్దగా తెలియదు. నేను నటించిన మొదటి రెండు చిత్రాలను ఇప్పుడు చూస్తే చాలా సిగ్గుగా అనిపిస్తుంది. దారుణంగా యాక్ట్ చేశాననే ఫీలింగ్ వస్తుంది. ఇంకా బాగా నటించవచ్చు కదా అనిపిస్తుంది. కానీ వీళ్లు అలా కాదు. తొలి సినిమానే అయినప్పటికీ యాక్టింగ్ బాగా చేశారు" అని సమంత చెప్పారు. నిర్మాతగా మారడంపై మాట్లాడుతూ.. జీవితంలో సవాళ్లను స్వీకరించడం తనకు ఇష్టమని ఆమె అన్నారు. నిర్మాతగా ఇదొక కొత్త ప్రయాణమని తెలిపారు. హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పేరి, శ్రియా కొంతం ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రమే 'శుభం'. ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించారు. సమంత సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై ఇది నిర్మితమైంది. మే 9 ఈ సినిమా విడుదల కానుంది.

# అలాంటి పాత్రలు చేయడం కంటే ఆంటీగా నటించడం ఉత్తమం: నటికి సిమ్రన్ కౌంటర్

ఏదో అలా వచ్చాం.. ఇలా వెళ్లిపోయామనే సీన్స్ కోసం స్క్రీన్‌పై కనిపించడం కంటే ఆంటీ లేదా అమ్మ పాత్రల్లో నటించడం ఎంతో ఉత్తమమన్నారు నటి సిమ్రన్ ఈ మేరకు తాజాగా ఓ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న ఆమె స్టేజ్‌పై మాట్లాడుతూ తన తోటినటి వ్యాఖ్యలు గుర్తు చేసుకున్నారు. ఇటీవల తాను ఆ నటికి సందేశం పంపానని.. ఆమె అన్న మాటలు తనని ఎంతో బాధించాయని పేర్కొన్నారు. అంతేకాకుండా అవార్డుల కార్యక్రమం వేదికగా ఆ నటి మాటలకు కౌంటర్ ఇచ్చారు.

"కొన్నిరోజుల క్రితం నాకు బాగా తెలిసిన తోటి నటికి సందేశం పంపించాను. ఆమె నటించిన ఓ సినిమాని ఉద్దేశించి అందులో రాసుకొచ్చాను. ఆ సినిమాలో ఆమె పాత్ర చాలా బాగుందని.. ఆ రోల్ చూసి ఆశ్చర్యపోయానని మెసేజ్ పంపా. దానికి ఆమె వెంటనే స్పందించింది. ఆంటీ రోల్స్‌లో నటించడం కంటే ఇది ఎంతో ఉత్తమం అంటూ రిప్లై ఇచ్చింది. నిజం చెప్పాలంటే ఆమె పంపిన మెసేజ్ నన్ను ఒకింత షాక్‌కు గురి చేసింది. ఆమె ఎంతో చులకనగా మాట్లాడినట్లు అనిపించింది. ఈ వేదికగా ఆమెకు నేను చెప్పేది ఒక్కటే. పనికిమాలిన డబ్బా రోల్స్‌లో నటించడం కంటే ఆంటీ లేదా అమ్మ పాత్రలు పోషించడం ఎంతో ఉత్తమం. ఏ వర్క్ చేసినా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి. మనపై మనం నమ్మకం ఉంచినప్పుడే వర్క్ కూడా అనుకున్న విధంగా పూర్తి చేయగలుగుతాం. దేనిని చులకనగా చూడకూడదు" అని ఆమె హితవు పలికారు.

దక్షిణాది సినీ ప్రియులకు సిమ్రన్ సుపరిచితురాలు. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడలో ఆమె ఎన్నో చిత్రాల్లో యాక్ట్ చేశారు. చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్, నాగార్జున, విజయ్, సూర్య, అజిత్ వంటి స్టార్ హీరోలతో ఆమె వర్క్ చేశారు. ప్రస్తుతం ఆమె సినిమాలతోపాటు వెబ్ సిరీస్‌ల్లోనూ యాక్ట్ చేస్తున్నారు. 'సిటడెల్ హనీ బన్నీ'లో కీలక పాత్ర పోషించారు. ఇటీవల విడుదలైన 'గుడ్ బ్యాడ్ అగ్లీ'లో సిమ్రన్ అతిథి పాత్రలో కనిపించి ప్రేక్షకులను అలరించారు.

